ఆమె చూస్తున్నది ...

బొబ్బిలి పులిపిల్లట! నిజమేనా? పులిపిల్లేనా అది ?

ఆప్యాయంగా చూచినట్లే వున్న దా చూపు! మేక కడుపున పులిపిల్ల పుడుతుందా మరి? కానీ ... ఆ చూపులో "తృప్తి" లేదు.

ఆమె కౌసల్యా దేవి! మనవణ్ణి చూపిస్తున్నది!

"మనవడు"

రామరాయనింగారు చాలా సంతోషపడ్డారని చెప్పాలి! మొదటి కొడుక్కి ముగ్గురూ ఆడ సంతానం. రెండో కొడుక్కి మొదటు మొగబిడ్డ పుట్టింది. విని ఆయన చాలా ఆనంద పడ్డారు.

కౌసల్యాదేవిగారు మనవడికి బంగారు మొలత్రాడు కట్టారు. రవ్వల వుంగరం తొడిగారు. నీలిరంగు రాయి తురాయి తల్లో మెరుస్తుంటే తెల్లటి బంగారు జరీచొక్కాలో ఆ పసిపాప యువరాజులా మెరిసి పోతున్నాడు.

"అదృష్ట జాతకుడు" అన్నది పురోహితుని భార్య సోమదేవమ్మ!

"కాకపోతే?" అని సాగదీసింది. పెద్దదాది చింతామణి.

కౌసల్యాదేవిగారి కంటి ఎరుపు ఆ సాయం సమయంలో ఎవ్వరూ చూడలేదు. పెద్దకోడలు దయవతీదేవి తన ముగ్గురు ఆడసంతానంతో, ముభావంగా వచ్చి నిలుచుంది. చక్కటి దుమ్మలతో విదేశీబిడ్డల్లా వున్నారు. రెండో కోడలు అరవిందా దేవి ముఖాన ఒక విధమైన కళ వెలిగిపోతోంది. ఆమె ఠీవిగా కూచునివుంది.

మామగారువచ్చి మనవణ్ణి ఆశీర్వాదించి పోయారు. మీసాలపై నిమ్మపండ్లు నిలబెట్టగలిగిన రామరాయనింగారు మనవడికిఒకతుపాకిబహుమతిగా ఇచ్చారు. 'బొబ్బిలి రామరాయనింగారి పేరు నిలపరా పులీ" అన్నారు.

తుపాకినిచూచి గర్వపడ్డదిఅరవిందాదేవి. కొంచెందూరంలో చిరునగవు మోముతో నిలుచుని వున్నాడు రాజభూషణరాయనింగారు. ఆయనే యువరాజు తండ్రి. రామరాయనింగారి మొదటి కొడుకు యుద్ధంలో చనిపోయాడు. రెండో కొడుకు మాత్రం దక్కాడు.

* * *

కాలగర్భంలో రోజులు కలసిపోతున్నాయి. కాలం కళ్ళెం లేని గుర్రంలా పరుగులుతీస్తోంది. ఈ పరుగులో పరువంతో పోటీ చేసే స్థితి కొచ్చాడు యువరాజు. నూనూగు మీసాల నూత్న యవ్వనంలో పదిహేడో వసంతాన్ని చూస్తున్నాడు.

రామరాయనింగారి మీసాల మీదికి ముసలితనం వచ్చికూచుంది. అవిప్పుడు బిగువుగా, నిటార్గా నిలబడలేక జారిపోతున్నాయి. నవ్వుతూ ఎప్పుడేనా "చిన్నరాయులు దీన్ని నిలపాలి" అంటుంటారు కుస్తీపడి ఆఖర్న.

తోటలోని పువ్వుల పిల్ల "గిరిక" కూడా నవ్వుతుంది. ఆ నవ్వులో అందరూ కరిగిపోతారు. గిరిక సరిగ్గా

యువరాజు పుట్టినప్పుడే చింతామణి కోడలికి పుట్టింది. చింతామణి కోడలు రాధామణి యువరాజుకికూడా పాలిచ్చింది. ఆ దాది అంటే యువరాజుకి వెఱ్ఱి ఇష్టం; గిరిక తలమీద ఎన్ని మొట్టికాయలు వేసినా దాది ఏమీ అనదు. అంచేత గిరికపై అధికారంతో పెరిగాడు యువరాజు. కానీ ఆ అందమైన చిన్నారి పెద్ద రాయనింగార్ని అమితంగా ఆకర్షించింది. మొదటి కొడుకు బిడ్డల్ని ఆడ పిల్లలని దగ్గరికి తియ్యని తాతగారు ఈ పిల్లతో ఆడుకోవటం చూచి అంతా ఆశ్చర్యపోయినా అణుచుకొనేవారు.

యస్. కె. జయశ్రీ

మల్లెపువ్వులాంటి తెలుపు, గులాబిలాటి మొహం. మబ్బుల్లా జీరాడే జుత్తుతో ఆ గిరిక రాజప్రాసాదాన్ని గిరగిర తిప్పేది. ఆ చిన్నిపిల్లను ఎవ్వరూ ఏమనేవారే కాదు. యువరాజుకి తోడుగా పెరగనిమ్మని పెద్ద దొరగారి ఆజ్ఞ, ఎవరు మీరుతారు!

పులిపిల్లకు పువ్వులపిల్ల తోడు! ఎంత విచిత్రం?

గిరిక ఇప్పుడు పసిపిల్ల కాదు! పువ్వుకి తావి అన్నట్లు ఆమెకు సౌందర్యం తోడయింది. ఆమెలో రాజభూషణరాయనింగారి పోలికలున్నాయి. ఆపిల్లనవ్వితే రాజభూషణరాయనింగారికో ఆనందం!

'యువరాజులో రాధామణి పోలిక వుంది' అని అనుకొనేవారంతా.

కట్టుబాట్లలో పెరిగిన గిరిక రా పోకలు మామూలుగా వున్నా, యవ్వనంలో పడ్డారు గనుక కాస్త బందీబస్తులో వుండాలని, వుంచాలని చింతామణితో అన్నది కౌసల్యాదేవి. గిరి రానిదానివల్ల రాజభూషణరాయనిగారే ఎక్కువ ఆవేదన పడేవాడు. ఆ రోజు యువరాజు పుట్టిన దినం. ప్రాసాదమంతా కలకలంగా వుంది. శోభాయమానంగా అలంకరించారు. గిరిక రాలేదు. ఆ రోజు ఆ పిల్లకు పుట్టినరోజు— రాధామణి జరుపుతుంది. రాజభూషణరాయనింగారికి ఓర్పు నశించింది. ఆయన మెల్లగా తుపాకి చేత పట్టుకొని తోటలోకి బయలుదేరాడు. ఆయన హృదయమెందుకో ఆవేదన పడుతోంది. నరం నరం మెలితిరిగిపోతోంది.

ఆ తోటలో రెండంకణాల ఇల్లుంది. అది చింతామణిది. లోపల అస్పష్టమైన పాట వినపడుతోంది. ఆ ఇంటికి మగవాడు పాపారాయుడొక్కడే దేవిడీవద్ద పగలు, రాత్రికూడా కాపలాదారి! లోపలికి మగ తేనేపోతు ప్రవేశించదు.

గిరిక తెల్లటిలంగా కట్టుకొన్నది. వయసుని బిగించిన చిన్నలోబాడీ సొగసుగా వుంది. తలంటిపోసుకొన్నది. మేఘంలాంటి జుత్తుని చిక్కు తీస్తూంది. ఇంకా చుక్కా, కాటుకా దిద్దుకోలేదు. కాళ్ళకు పూసిన పసుపు మెరుస్తూంది. నిలువుటద్దం

ముందు నిలుచొనివుంది.

ఆ పిల్ల కళ్లకు యువరాజు కన్పిస్తున్నాడు. వయసుకు మించి పెరిగిన యువరాజు ఆరోగ్యకరమైన కసరత్తు శరీరం ఇప్పుడిప్పుడూ గిరికని ఆకర్షిస్తోంది. ఆ పిల్ల అందమైన కండ్లు మెరుస్తున్నాయి.

అద్దంలో రూపుని చూచి గిఱున తిరిగింది గిరిక. "బాబుగారా!" అన్నది తడబడుతూ, లేడి పిల్లలా వెనక్కి తగ్గుతూ.

రాజభూషణరాయనింగారు ఆవేశ పూరితులయ్యారు. గిరిక సౌందర్యం ఆయన వివేకాన్ని మింగుతోంది కొండచిలువ నోటికి మేక దొరికినట్టు.

"గిరీ!" పంజా ఎత్తిన పులిలా ఆవేశపడుతున్నాడాయన.

"ఎవరు ?"

కౌసల్యాదేవి వులిక్కిపడ్డది. కౌగిలికొదవని గిరిక రాజభూషణరాయనింగారి బలమైన చేతుల్లో విలవిలలాడిపోతుంది. కౌసల్యాదేవి మనసు రాయియై పోయింది. ఆచ్ఛాదనలేని గిరికని చూసి ఆవేశపూరితుడైన కొడుకుని చూస్తూ ఆమె వివేకం కోల్పోతోంది. అయినా నిగ్రహించుకొన్నది.

"బాబూ!" కౌసల్యాదేవి గొంతు ఖంగుమంది.

రాజభూషణ రాయనింగారి గుండె అదిరింది.

ఎవరూ ! తల్లి ?

ఆయన విసవిస నడిచిపోతే గిరిక ఆపాదమస్తకం వణికిపోతూ రాధామణిని కావలించుకొని కూలిపోయింది.



రాధామణి, కౌసల్యాదేవి ఒకరికొకరు అలా నిలబడి పోయారు కాసేపు ! పెద్దగా నిట్టూర్చి తుపాకి తీసుకొని బయలుదేరింది రాజమాత.

"తలుపులు వేసిపెట్టు రాధామణీ !" అన్నది.

"అమ్మా !" గిరిక దుఃఖం పొంగింది.

"ఊరుకో తల్లి ! బాబుగారిలా ఎప్పుడేనా వచ్చారా ! ఇంత సాహసానికి ఒడికట్టారా" రాధామణి గిరిక వేపు తట్టుతూ అన్నది.

"లేదమ్మా ! ఆయన నన్నువ్వుతూ చూసేవారు ఎప్పుడూ ! నాలుగేళ్ళయిందిగా, నే నాయన కండ్లపడి - కాదు, ఆయన్ని చూచి ! పుట్టినదిన సందర్భంలో వాళ్ళందరినీ వెనక నాటుగా చూశానంతే. "తాతగారి దగ్గరికి కూడా పోవద్దన్నావు" గిరిక కన్నీటితోనే అన్నది.

"అవును తల్లీ ! రాయలు నీకు వయసులో పితృ సమానులు."

"అమ్మా ! ఆయన ఆవేశం చూస్తే భయం వేసింది ! ఆయన్ను నేను చూచి ఏండ్లయినా మొన్న మొన్న చూచినట్లున్నది !"

"చాలు !" కర్కశంగా అన్నది రాధామణి. ఆయన పెద్దవారు, పితృ సమానులని చెప్పానా !"

"అవును !" గిరిక గొణుక్కుంది.

"అమ్మా ! ఆయన కౌగిలిలో నాకు వింత ఆనందం అవుపడ్డది ! నువ్వన్నట్టు తండ్రిని బిడ్డ కౌగలించుకొన్నట్టు కాని..."

గిరిక రాధామణి కండ్లు చూచి

భయపడింది. ఏదో తప్పుచేసినదానివలె తల వంచుకొంది.

ఆ తర్వాత. అంతఃపురానికి వచ్చిన గిరికని చూచి అరవిందాదేవి తెల్లబోయింది. పుణికి పుచ్చుకొన్నట్లుంది రూపు రేఖలు ఈ పిల్ల భర్తదగ్గర. ఆమెకు రాధామణి మీద కోపం వచ్చింది. మహా పతివ్రత ఎలా అవుతుంది ఒక దాసీ కూతురు, పెండ్లి చేసుకొన్నంత మాత్రాన? ఏనాడూ లేని అసూయ వచ్చింది అరవిందాదేవికి! మునిపండ్లతో నొక్కుకొన్నది. శిరసు మూర్కొని యువరాజుని రాధామణి దీవించడం ఆమె కండ్లు తడి అవ్వడం ఎవరూ చూడలేదు. "పిచ్చిదాసి" అని సంతోషించాడు యువరాజు.

'ఊఁ' వరునిచూసి శుభస్యశీఘ్రము పెండ్లిచేయించు గిరికకు!' అన్నారు పెద్ద రాయసింగారు పకాల్లునవ్వి. గిరిక నవ్వుతూనే 'పొండి తాత గారూ' అన్నది.

'తప్పు... వారు ప్రభువులు' ఇంకా మరీ మెల్లగా అన్నది.

రాజభూషణరాయసింగారు ఎంత కళ్లు చేసుకొని చూస్తున్నారు [illegible]

గిరిక [illegible] చూసి తలవంచుకొంది. అరవిందాదేవి [illegible] రాజభూషణరాయసింగారు మందహాసం చేశారు.

కోలాహలం అధిక మౌతోంది. [illegible] గిరిక అంతఃపురంతో వుంది. రాజభూషణ

రాయసింగారు తోటంతా కలయ తిరుగుతున్నాడు. చెట్లదగ్గర శబ్దమయింది.

"రాధామణీ!"

రాధామణి వులిక్కిపడ్డది. ఎదురుగా చిన్నరాయసింవారు!

"రాధామణీ! గిరికకోసమని చూశాను!" వికటంగా నవ్వాడాయన.

"మహా ప్రసాదం బాబూ! వస్తాను!" రాధామణి తడబడ్డది.

"రాత్రి పడ్డది! గిరికని వసంత మంటపానికి పంపు!"

"బాబుగారూ!"

"ఉష్!"

"బాబుగారూ!"

"వసంత మంటపానికా! రాయసింగారు వెళ్ళిపోయారు."

రాధామణి కళ్ళు తిరిగిపోయినవి. ఆమె చెంప ఛెళ్ళుమంది! గిరగిర తిరుగుతున్న కండ్ల కద్దంపడి అరవిందాదేవిగారు విసవిసా నడిచిపోయారు.

'రాధామణీ!' మృదుహస్తం రాధామణి చెంప నిమిరింది.

'అమ్మగారూ!' రాధామణి వణికిపోయింది.

'భయం లేదు! లే!' కౌసల్యాదేవి కంఠం చల్లగా వినపడ్డది.

"భయం లేదా! మీరు వినలేదు!" రాధామణి గొంతు జీరవోయింది.

"అంతా విన్నాను! నేనూ వెంటవెంటే తిరుగుతున్నాను. రాధామణీ! గిరికను పిల్చుకొని ఈ రాత్రి రాత్రికి విజయనగరం తరలిపో".

"చిత్రం అమ్మగారూ !"

... ... ... ... ...

"ఎలా వుంది ?"

వైద్య శిఖామణి నిట్టూర్చి కూర్చున్నాడు. "అమ్మా! బాబుగారి కిది మనోవ్యాధి! ఆయన పలవరిస్తున్న "గిరి" కన్పిస్తే ఆయన కోలుకొనేందుకు ఆస్కారముంది! ఇంతకన్నా మరో దారి లేదు".

కౌసల్యాదేవి కొడుకువేపు చూస్తూ కూచుని వుంది. ఆమె మాతృహృదయం పరిపరి విధాలుగా పరుగెడుతోంది. పూజామందిరంలో వున్న అరవిందాదేవిని తల్చుకొంటే ఆమె గుండె తరుక్కొని పోతోంది. రాజమందిరమే మూగవోయింది. ఆమె మౌనంగా పూజా మందిరానికి దారి తీసింది. అత్తగారిని చూచి అశ్రునయనాల్ని తుడుచుకొంది అరవిందాదేవి. కౌసల్యాదేవి దేవుని విగ్రహం ముందు కూచున్నది. అత్తగార్ని ఆత్రంగా చూస్తోంది అరవిందాదేవి.

"అమ్మా ! అరవిందా ! ఒక్కమాట."

"చెప్పండి అత్తయ్యగారూ !"

"అరవిందా ! ఒక తప్పు చేశాను ! నన్ను క్షమించు ! ఈ దేవుడు నన్ను క్షమించడు, నాకు తెలుసు ! నీవు క్షమించలేవు ! గిరిక నీ కూతురు ! యువరాజు రాధామణి కొడుకు ! వంశాంకురంకోసం తాతగారి మనశ్శాంతి కోసరం నేనే సాహసం చేశాను ! గిరికని కలవరిస్తున్నాడు. వాని మనసు పూరటకలిగించు !"

అరవింద తెల్లబోయింది. రహస్యమిదా ! ఎలా చెప్పడం ? ఆయన ప్రాణాలతో వుంటారా విని ! చెప్పలేక పోతే? ... "అరవిందాదేవి పరుగుపరుగున వచ్చింది. పిచ్చివానిలా పడుకొని గడ్డాం పీక్కొంటున్నాడు చిన్న రాయనింగారు. "దేవీ! వచ్చావా ! ఒక్కసారి గిరిని చూపించండి.

"ఒక్కసారి ... ఈ అంత్య సమయంలో ఒక్కసారి ..."

"ప్రభూ ! వూరటపడండి. పుత్రికా సమానురాలైన గిరిక గురించి మర్చిపోండి. లోకం నవ్విపోతోంది !" భర్త పాదాలదగ్గర కూచుందామె. "పుత్రి ! దేవీ ! గిరిక మర్చిపోలేను ! ఆహా ! ఆరోజు కౌగలింతలో ఎంత వెచ్చదనం ఇమిడి వుంది ! దేవీ ! నా ప్రాణాలమీద విలువలేదు మీకు ! దాసీ కూతురుగిరి. దాన్ని చూపించుటానికి ..."

"ప్రభూ! మీలో వివేకం లేదా! గిరిక పుత్రిగా భావించండి. మీకు శాంతి కలుగుతుంది. నన్ను మన్నించండి !" ఆమె కండ్లు మూసుకుంది.

"దేవీ ! గిరిక చూపించవా?"

"ఆమె నా పుత్రి! మన్నించండి!" అరవింద కండ్లు తెరచింది.

"పుత్రి! మళ్ళా అదే మాటా! ఆ మేక పులిఅవుతుందా! మేక కడుపున పులిపిల్ల పుట్టదు."

"ముమ్మాటికీ పుత్రి ! నాకు కవలలు పుట్టారు !"

"కాదు ! వ్యభిచారివి!" అరవిందాదేవి చెంప ఛెళ్ళుమంది. మృత్యువు

నెదురొక్కొంటున్న చిన్నరాయనింగారు లేచి కూచున్నాడు. అరవిందా దేవి కొప్పు పట్టుకొని క్రిందికి త్రోశాడు. ఆమె క్రిందపడ్డది.

"చెప్పు! నిజం చెప్పు!"

"అవును, మీ అమ్మగారి పాదాల సాక్షిగా నిజంగా పుత్రి. ఆమెలో మీ పోలిక లున్నవి! చూడండి! నన్ను నమ్మండి!"

చిన్న రాయనింగారి బుర్ర గిర గిర తిరుగుతోంది. కవలలైతే, ఆడపిల్లను రాధామణికి ఇవ్వాల్సిన అవసరం ఎందుకు కలిగింది! ఇదంతా కల్పితం కావచ్చు! అంతే! ఈ ఆడది సవతి మీది అసూయతో చెపుతోంది!

"పుత్రి! నీ పుత్రి, గిరిక! శెభాష్! దేవీ!" చిన్న రాయనింగారు వికటంగా నవ్వాడు. "ఎక్కడున్నా సరే! గిరికని ఈడ్చుకొని వస్తా!"

"ప్రభూ!" మూలిగింది అరవిందా దేవి.

"రాయా" కౌసల్యాదేవి ప్రసన్నంగా నిలబడ్డది.

"అమ్మా! కట్టుకథలు వాకొద్దు! వైద్యపరీక్షలు చేయిస్తున్నాము. తిరిగివస్తే గిరికతోనే ... బొబ్బిలిపులి మేకపిల్లను కనదు!"

"అత్తయ్యా!" బావురుమంది అరవిందాదేవి. "నిజమే చెప్పారా?" కౌసల్యాదేవి మాట్లాడలేదు. "అత్తయ్యగారూ! నిజం చెప్పండి! గిరిక రాధామణికీ మీ కొడుక్కీ పుట్టిన పిల్లా?"

"అరవిందా! ఎలా అయినా నా కొడుకు గిరికకు తండ్రి!"

అరవిందాదేవి ముఖం వాలి పోయింది.

... ... ... ... ... ...

ఇంకా మీసాలుకూడా రాని ఆ అందమైన యువకుణ్ణి సాదరంగా ఆహ్వానించాడు యువరాజు. ఆ యువకుడు యువరాజు ప్రియసఖుడయి పోయాడు. కాలము దొర్లి పోతున్నది. రాజభూషణరాయనింగారి జాడలేదు. ఒకరోజు కొడుకుతో వచ్చిన ఆ యువకుడి అసలు రూపం అరవిందాదేవి కనుక్కొంది.

"గిరికా?" అన్నది ఆశ్చర్యంగా

"అవును!" అన్నది గిరిక నిర్భయంగా.

"మీ అమ్మ ఎక్కడ?"

"తుపాకి దెబ్బతిని చనిపోయింది."

"నిజమా!" అరవిందాదేవి అనుమానంగా అన్నది.

"అవును! తుపాకితో అమ్మ కాల్చబడ్డది. ఆ తర్వాత".

"తుపాకి..." అరవిందాదేవి తొట్రుపడ్డది.

"కాల్చినవారు ప్రభువుగారు! యువరాజు ప్రమాదానికి లోనయినారన్నారు. ఆమె మూర్ఛపోయింది. ఆయన వెంటనే ఆమెను కాల్చి, వెళ్ళిపోయారు."

"ఆయన ఎక్కడ వున్నారు?" అరవిందాదేవి ఆత్రంగా లేచింది.

"నా కత్తికి ఎర అయ్యారు!" శాంతంగా అన్నది గిరిక.

"గిరికా!" అరవిందాదేవి నిలువునా వణికి పడిపోయింది. గిరిక నిశ్చలంగా నిలబడ్డది. కౌసల్యాదేవి గదిలో ప్రాణం లేని ఆమె శవం అందరికీ అవుపడ్డది...

పులిపిల్లతో ఆటాడితే ప్రమాదమే!